

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ఓటింగ్ శాతం పెంచడంపై శ్రద్ధ చూపాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్**

హనుమకొండ, నవంబర్ 6 : మిషన్–29 కార్యక్రమం ద్వారా అర్బన్ ఏరియాలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో స్వీప్ కార్యక్రమం, ఎంసీఎంసీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 100 శాతం ఓటింగ్ లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు. ఓటర్లకు ఈ నెల 10 నుంచి 25 వరకు ఓటరు స్లిప్‌లు అందజేస్తామని తెలిపారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఓటరు చైతన్య రథం ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఏదైనా ఫిర్యాదు ఉంటే సీ విజిల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950కి కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో టోల్‌ఫ్రీ ద్వారా ఇప్పటి వరకు మొత్తం 40 కేసులు నమోదు కాగా, సీ విజిల్‌లో 54 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అందులో 11 పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. వార్తా పత్రికలు, సోషల్‌మీడియా కథనాలను మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) పర్యవేక్షిస్తున్నదని కలెక్టర్ తెలిపారు. దీని అనుమతి లేకుండా ప్రింటర్లు పోస్టర్లు, కరపత్రాలు ముద్రించవద్దన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, డీఆర్‌వో వైవీ గణేశ్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఇండస్ట్రీ జీఎం హరిప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి కే మధురిమ, డీపీఆర్‌వో లక్ష్మణ్ కుమార్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీస్ శ్రీధర్ పాల్గొన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక**

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక(యూఎఫ్‌ఈపీ) ప్రతినిధులు కలిశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి పర్యావరణ పరిరక్షణపై వినతి పత్రం అందజేశారు. యూఎఫ్‌ఈపీ అధ్యక్షుడు కే పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి టీ శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, రవిబాబు, సహాయ కార్యదర్శి రాజయ్య, ముఖ్య సలహాదారుడు సిరాజుద్దీన్, పీఆర్‌వో పరశురాములు, వేణు, శ్రీనివాస్, జగన్, డాక్టర్ సూర్యకిరణ్ ఉన్నారు.

## కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావుకు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ రమేశ్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6 : కేయూ స్పోర్ట్స్ బోర్డు నూతన కార్యదర్శిగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ ప్రొఫెసర్ పీ శ్రీనివాసరావును నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన దివ్యాంగుల సెల్ సంచాలకులుగా, అడ్మిషన్ల డైరెక్టరేట్ జాయింట్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్‌గా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పాఠ్యప్రణాళికా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా ఉన్నారు. అలాగే, కేయూ పరిధిలోని కొత్తగూడెం ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఈఈఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టీజగన్మోహన్ రాజును నియమించారు.

## గణితంలో మాస్టర్స్‌కు ఉచిత శిక్షణ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6 : దేశంలోని ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో మాస్టర్స్ కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గణితంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్ట్స్ కళాశాల గణితవిభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగయ్య తెలిపారు. జాతీయస్థాయిలో ఫిబ్రవరిలో నిర్వహించే ఐఐటీ జామ్(జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్స్), సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షల కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు రోజు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు తరగతులు, మోడల్ టెస్ట్ సిరీస్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గణిత అభ్యర్థులు వివరాలకు 97012 75354 నంబర్‌లో సంప్రదించాలని డాక్టర్ నాగయ్య కోరారు.

## నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 6 : పుస్తకాలు విజ్ఞానాన్ని పెంపొందించి, మనిషి జీవితాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాయని సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లోని నవచేతన(విశాలాంధ్ర) బుక్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. నవచేతన విజ్ఞాన సమితి సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, అన్ని రకాల పుస్తకాలపై 10 నుంచి 30 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ శ్రీధర్, కర్రె భిక్షపతి, ఎం శంకర్‌నారాయణ, గడ్డం కేశవమూర్తి, తిరుపతిరెడ్డి, మురళి, బండి మొగిలి పాల్గొన్నారు.

# గుడిసెవాసులను ఆదుకున్నది బీఆర్‌ఎస్సే..

- గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగానే చూశాయి
- పట్టాలు ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- చీఫ్ విప్ వినయ్ భాస్కర్
- గుడిసె వాసులతో ఆత్మీయ సమ్మేళనం
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



న్యూశాయంపేట : యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, నవంబర్ 6 : గత ప్రభుత్వాలు గుడిసెవాసులను విస్మరించినప్పటికీ, తెలంగాణ ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారికి అండగా నిలిచిందని వరంగల్ పశ్చిమ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నిర్వహించిన తెలంగాణ గుడిసెవాసుల సంఘం ఆత్మీయ సమ్మేళనంలో వినయ్ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. తనకు గుడిసెవాసులతో అనుబంధం ఇప్పటిది కాదని, కొన్నేళ్ల నుంచి ఉందన్నారు. గుడిసె వాసుల సమస్యలపై గత ప్రభుత్వాలపై పోరాటం చేశానన్నారు. ఎల్లప్పుడూ వారికి వెన్నంటి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. 50 ఏండ్లుగా తీరని గుడిసె వాసుల సమస్యలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. పట్టాలు ఇచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో మౌలిక సౌకర్యాలను కల్పించామన్నారు. తాను కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు గుడిసె వాసుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాటం చేశానన్నారు. తన సోదరుడు ప్రణయ్ భాస్కర్ తర్వాత గుడిసెవాసులకు అండగా ఉన్నది తానేనని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని గుడిసెవాసుల పిల్లలు ఉన్నత విద్య చదవడానికి తన వంతు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. కరోనా కష్టకాలంలో, వరదలు వచ్చినప్పుడు నిత్యావసర వస్తువులను ఇచ్చినట్లు తెలిపారు. గుడిసె వాసులు ఏ కష్టంలో ఉన్నా వారికి అండగా ఉంటున్నానని తెలిపాఉ. కాగా, ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంలకు చెందిన వంద మంది గుడిసె వాసులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని కండువా కప్పి చీఫ్ విప్ ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలంగాణ గుడిసెవాసుల సంఘం అధ్యక్షుడు కారు ఉపేందర్, గౌరవ సలహాదారు సిరబోయిన కరుణాకర్, ప్రధాన కార్యదర్శి బొట్ల కుమారస్వామి, కోశాధికారి ఎర్ర చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఏసబోయిన శ్రీనివాస్, సురేందర్, నాయకులు సమద్, వనమాల, రాజశేఖర్, బిక్షపతి, హస్సేన్‌బీ, శ్రీలత పాల్గొన్నారు.

**సీడీని ఆవిష్కరించిన చీఫ్ విప్**

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు మాల కుమ్మరి పరశురాములు సహకారంతో మాల కుమ్మరి శిరీష, సింధూజ నిర్మాణ సారథ్యంలో రవితేజ రచించి, ఇనుగుర్తి మధు పాడిన పాటను చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పాటకు హనుమకొండ భిక్షపతి సంగీతం అందించారు. ఈ పాట విన్న చీప్ విప్ చాలా బాగుందని అన్నారు. తన మీద ప్రేమతో పాట చేసిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, కల్పలత సూపర్ మార్కెట్ వైస్‌చైర్మన్ షఫీ, బీఆర్‌ఎస్ నాయకులు పులి రజినీకాంత్, రాచర్ల జగన్, దీపు, శివకుమార్, అయేషా ఫాతిమా, బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, పొడిశెట్టి వాసు, వివేక్, మౌనిక పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..**

న్యూశాయంపేట : గ్రేటర్ 31వ డివిజన్‌కు చెందిన పలువురు కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్ ఆధ్వర్యంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రితిక్, శ్రీకాంత్, రాజేశ్‌చారి, పిన్నింటి చందు, వినయ్, హేమంత్, శంకేసి చందు, శివ, సాయిచరణ్, సురేందర్, శివ, ముఖేశ్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

## బీసీ అభ్యర్థి వినయ్‌భాస్కర్‌ను గెలిపిద్దాం

**తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కాజీపేట, నవంబర్ 6 : ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే వరంగల్ పశ్చిమ నియోజకవర్గం బీసీ కులానికి చెందిన అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ గెలుపే లక్ష్యంగా బీసీ సంఘాలు, కుల సంఘాలతో పాటు అని వర్గాల ప్రజలు పని చేయాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ కోరారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్ నగర్‌లో సోమవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం బర్కం రామ్మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో బీసీలు వెనుబడిపోయారన్నారు. వరంగల్ పశ్చిమ నుంచి బీఆర్‌ఎస్ టికెట్ పొందిన బీసీ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, చట్టసభల్లోకి పంపాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వినయ్‌భాస్కర్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి, ప్రజలతో సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో దామెరుప్పుల జనార్దన్, దొడ్డిపాటి శేఖర్, పొన్నం వెంకటేశ్వర్లు గౌడ్, వెలకంటి రాజనంద, అబ్బోజు శంకరమూర్తి, గుంటి మధుసూదన్ పాల్గొన్నారు.

# గడపగడపకూ బీఆర్‌ఎస్ ప్రచారం



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రాజు, దాస్యం యువసేన

న్యూశాయంపేట, నవంబర్ 6 : గ్రేటర్ 31వ డివిజన్ న్యూశాయంపేటలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారానికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నదని కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. ప్రచారంలో భాగంగా సోమవారం దాస్యం యువసేనతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ కారు గుర్తుకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోలోని పథకాలు ప్రజలకు వివరించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జి జోరిక రమేశ్, యూత్ అధ్యక్షుడు ఆదే ఉమేశ్‌తో పాటు దాస్యం యువసేన, డివిజన్ యువ నాయకులు పాల్గొన్నారు.

## మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ అంబాసిడర్‌గా క్రికెటర్ ధోని



ధోనితో దవాఖాన నిర్వాహకులు

హనుమకొండ సిటీ, నవంబర్ 6 : మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ అంబాసిడర్‌గా ఇండియన్ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోని వ్యవహరించనున్నట్లు హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు తెలిపారు. ధోని మద్దతుతో దేశంలో అంధత్వాన్ని నివారించే దిశగా ముందడుగు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కీలకమైన కంటి సంరక్షణ సేవల అందించేందుకు పశ్చిమ భారతదేశంలో నెలకొల్పిన 45 కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ధోని తమ దవాఖానకు అంబాసిడర్‌గా వ్యవహరించడం గర్వంగా ఉందని తెలిపారు.

## శ్యామల దుర్గాదాస్ కాలనీ కమిటీ ఎన్నిక

నయీంనగర్, నవంబర్ 6 : వడ్డేపల్లి వంద ఫీట్ల రోడ్డులోని శ్యామల దుర్గాదాస్ కాలనీ అభివృద్ధి కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ నల్లాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తంగళ్లపల్లి శంకరాచారి, గౌరవ అధ్యక్షుడిగా పొన్నోజు వీరబ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శిగా బొద్దిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రొయ్యల సత్యం, కోశాధికారిగా గూడూరు రవీందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కటకం శివప్రసాద్, రాంపల్లి రాజప్రభు, నల్ల ప్రసాద్, చెన్నూరి బాబురావు, రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఓటు వజ్రాయుధం

హనుమకొండ, నవంబర్ 6 : ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిందని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. సోమవారం ఓటు విలువపై హనుమకొండలోని స్వధార్ మహిళా ఆశ్రమంలోని మహిళలకు అనితారెడ్డి అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేస్తామని మహిళలతో అనితారెడ్డి ప్రతిజ్ఞ చేయించారు.